ప్రజాశక్తి

బుధవారం 8 జనవరి 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

సర్వం సిద్ధం

- ప్రధాని పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం
- నేడు నగరంలో మోడీ రోడ్‌షో, బహిరంగ సభ
- వర్చువల్ పద్ధతిలో పలు ప్రాజెక్టులు ప్రారంభం
- పోలీసు వలయంలో ఎయు పరిసర ప్రాంతాలు
- 3 లక్షల మంది జన సమీకరణకు 'కూటమి' నేతల కసరత్తు



ప్రధాని సభకు సిద్ధమైన వేదిక



ఏర్పాట్లును పరిశీలిస్తున్న అనిత

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ

భారత ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం విశాఖలో పర్యటించనున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట ఏర్పాట్లు చేసింది. వారం రోజుల నుంచి పలువురు మంత్రులు, ఐఎఎస్‌లు విశాఖలోనే ఉంటూ ఈ ఏర్పాట్లును మంగళవారానికే ఓ కొలిక్కితెచ్చారు. విశాఖ నగరం పిఎం పర్యటన నేపథ్యంలో భద్రతా వలయంలోకి వెళ్లిపోయింది. ట్రాఫిక్ ఆంక్షలు అమలవుతున్నాయి. బుధవారం సాయంత్రం 4 గంటలకు ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి విశాఖలోని ఐఎన్‌ఎస్ డేగాకు ప్రధాని మోడీ చేరుకుంటారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బిజెపి ఎంపీ పురంధరేశ్వరి సహా పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు మోడీ పర్యటనలో భాగస్వాములు కానున్నారు. సాయంత్రం 4.45 నుంచి 5.30 గంటల వరకూ నగరంలోని వెంకటాద్రి వంటిల్లు నుంచి ఎయు ఇంజినీరింగ్ కళాశాల మైదానం వరకూ మోడీ రోడ్డు షో ఉంటుంది. అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారు.

7 వేల వాహనాలతో తరలింపు

ప్రధాని సభను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కూటమి ప్రభుత్వం 3 లక్షల మందిని సభకు తరలించే దిశగా కసరత్తు చేస్తోంది. ఆర్‌టిసి మిగతా 2లో..



ఎయు మైదానంలో సాగుతున్న భద్రతా ఏర్పాట్లు



కోటేశ్వరరావును హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

అడుగడుగునా నిర్బంధం

- సిపిఎం నాయకుల కదలికలపై పోలీసు నిఘా
- పలువురు హౌస్ అరెస్టు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, నక్కపల్లి, ఎస్.రాయవరం, కశింకోట విలేకరులు

జిల్లాలో ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం వర్చువల్‌లో శంకుస్థాపన చేయనున్న గ్రీన్ హైడ్రోజన్ హబ్, బల్క్ డ్రగ్ పార్కు ప్రాంతాల్లో ప్రభుత్వం మంగళవారం ఉదయం నుంచే పోలీసులను భారీగా మోహరించింది. సిపిఎం నాయకులపై అడుగడుగునా నిర్బంధం ప్రయోగించింది. పలువురిని పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. అచ్యుతాపురం మండలం పూడిమడక వద్ద హైడ్రోజన్ హబ్‌కు, నక్కపల్లి మండలంలోని రాజయ్యపేట వద్ద బల్క్ డ్రగ్ పార్కుకు ప్రధాని బుధవారం శంకుస్థాపన చేయనున్నారు. బల్క్ డ్రగ్ పార్కు శంకుస్థాపన రద్దు చేయాలని మత్స్యకారులు, రైతులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల బతుకులను దెబ్బతీసే బల్క్ డ్రగ్ పార్కు శంకుస్థాపనను వ్యతిరేకిస్తూ నల్లరిబ్బన్లు కట్టుకొని నిరసన తెలపాలని సిపిఎం పిలుపునిచ్చింది. మోడీ సభకు, వర్చువల్ కార్యక్రమానికి వెళ్లకుండా నిరసన తెలపాలని ఇచ్చిన మిగతా 2లో..

టిజి.భరత్‌ను మంత్రి పదవి నుంచి తొలగించాలి

వార్త 4లో..

హైడ్రో పవర్ ప్లాంట్ల అనుమతులు రద్దు చేయాలి

వార్త 2లో..

కబడ్డీ పోటీల్లో రన్నర్స్‌గా డైట్ విద్యార్థులు

వార్త 5లో..



రాజయ్యపేట సముద్ర తీరంలో జలదీక్ష చేపట్టిన సిపిఎం నాయకులు, మత్స్యకారులు

బల్క్ డ్రగ్ పార్కును వ్యతిరేకిస్తూ
మత్స్యకారుల జల దీక్ష

వార్త మెయిన్‌లో...

ఉక్కు ప్రైవేటీకరణ విరమించుకోవాల్సిందే..

- కూర్మన్నపాలెం కూడలిలో కార్మికుల 36 గంటల దీక్ష ప్రారంభం
- జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద వామపక్షాల భారీ ధర్నా

ప్రజాశక్తి - ఉక్కునగరం, కలెక్టరేట్ విలేకరులు

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలంటూ విశాఖ నగరంలో మంగళవారం భారీ ఆందోళనలు సాగాయి. ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగిస్తూ సెయిల్‌లో విలీనం చేయాలని, ఉద్యోగుల వేతనాలను సకాలంలో చెల్లించాలని, ఈ నెల 8న విశాఖకు వస్తున్న ప్రధాని మోడీ ఉక్కుపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో 36 గంటల నిరవధిక దీక్షకు ఉక్కు కార్మికులు, వారి కుటుంబీకులు దిగారు. మంగళవారం ఉదయం నుంచే ఈ శిబిరానికి మిగతా 2లో..



జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహిస్తున్న వామపక్ష పార్టీల నాయకులు



రాత్రి వేళ దీక్షా శిబిరంలోనే నిద్రిస్తున్న ఉక్కు కార్మికులు

మొదటి పేజీ తరువాయి..

సర్వం సిద్ధం


టిడిపి జెండాలను సిద్ధం చేస్తున్న కూలీలు

బస్సులు సహా 7 వేల వాహనాలను జనాలను తరలించేందుకు సమకూర్చారు.

4 వేల మంది పోలీసులతో బందోబస్తు

మోడీ పర్యటన నేపథ్యంలో ప్రభుత్వం 4 వేల మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తోంది. 35 మంది ఐపిఎస్ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే ఎయు పరిసర ప్రాంతాల్లో డ్రోన్లను నిషేధించారు. బుధవారం స్కూళ్లు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలన్నిటికీ ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ఆంధ్రా యూనివర్శిటీలో బుధవారం జరుగనున్న అండర్ గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్, స్పెషల్ ఎగ్జామినేషన్స్ అన్నిటినీ వాయిదా వేశారు.

ప్రధాని ప్రారంభించే ప్రాజెక్టులివే..

ఎయు గ్రౌండ్స్‌లోని బహిరంగ సభ ప్రాంగణం నుంచే జాతీయ గ్రీన్ హైడ్రోజనర్ మిషన్‌లో భాగంగా పూడిమడకలోని ఎన్‌టిపిసికి చెందిన రూ.1.85 లక్షల కోట్ల గ్రీన్ హైడ్రోజన్ ఎనర్జీ ప్రాజెక్టుకు ప్రధాని మోడీ వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. విభజన హామీల్లో భాగమైన దక్షిణ కోస్తా రైల్వేజోన్‌కు శంకుస్థాపన చేస్తారని తెలుస్తోంది. పారిశ్రామిక, మౌలిక వసతుల రంగాలకు సంబంధించిన కొన్ని ప్రాజెక్టులనూ మోడీ ప్రారంభించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని రూ.19500 కోట్ల విలువైన రైల్వే, రోడ్డు ప్రాజెక్టులను ప్రధాని ఇక్కడి నుంచే వర్చువల్‌గా ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు

ఎయు మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత పరిశీలించారు. పోలీస్ ఉన్నతాధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ప్రజలు ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. 2019 నుంచి 2024 వరకు పాయకరావుపేటలో ఒక్క కంపెనీ కూడా రాలేదని, ఇప్పుడు బల్స్ డ్రగ్ పార్క్ వంటివి రాబోతున్నాయని చెప్పారు. ప్రధాని పర్యటన ప్రాంతంలో పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు.

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం మధ్యాహ్నం ఆంధ్ర యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరుగుతున్న ప్రధాని మోడీ పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ సభా ప్రాంగణానికి చేరుకుంటారని తెలిపారు.

అడుగడుగునా నిర్బంధం

పిలుపునకు ప్రజల నుంచి స్పందన రావడంతో ప్రభుత్వం పోలీసులను దించింది. నిరసనలు జరగకుండా పలు చర్యలు చేపట్టింది. ప్రజలను బస్సుల్లో దగ్గరుండి తీసుకెళ్లే బాధ్యతను విఒఎ, విఆర్‌పిలకు అధికారులు అప్పగించారు. మోడీ సభ, శంకుస్థాపన సందర్భంగా ప్రజల నుంచి నిరసనలు లేకుండా పోలీసులు ముందస్తు అరెస్టులు చేస్తున్నారు. కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. నిర్వాసిత గ్రామాల్లో పోలీసులు సమూహంగా తిరగడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. నక్కపల్లి, అచ్యుతాపురం సహా జిల్లాలోని సిపిఎం నాయకుల కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు.

ఎక్కడికక్కడ హౌస్ అరెస్టులు

నక్కపల్లి ప్రాంతంలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటును వ్యతిరేకిస్తూ, విశాఖపట్నం–చెన్నయ్ ఇండస్ట్రియల్ కారిడార్ (విసిఐసి) నిర్వాసితులకు పరిహారం, ప్యాకేజీ ఇవ్వాలని పోరాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజును మంగళవారం ఉదయం నుంచి ఎస్.రాయవరం మండలం ధర్మవరంలో పోలీసులు గృహ నిర్బంధం చేశారు. సాయంత్రం నుంచి పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావును, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణను, పార్టీ అచ్యుతాపురం మండల కన్వీనర్ ఆర్.రాము, మండల కమిటీ సభ్యులు సోమునాయుడు, కె.కోటపాడు మండల నాయకులు ఎర్రా దేముడు, కశింకోట మండల నాయకులు దాకారపు శ్రీనివాసరావు, డిడి.వరలక్ష్మి, నక్కపల్లి మండల నాయకులు ఎం.మహేష్ బాబు, మైలపల్లి జాను, మైలపల్లి బైరాగిరాజులను హౌస్ అరెస్టు చేశారు.

ప్రభుత్వ, పోలీసు తీరును ఖండించిన సిపిఎం

అక్రమ హౌస్ అరెస్టులను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు. ప్రజా సమస్యలను పరిష్కరించకుండా సిపిఎం నాయకులను గృహ నిర్బంధం చేయడమంటే ప్రజాస్వామ్య హక్కులను ఖూనీ చేయడమే అవుతుందని పేర్కొన్నారు. పిఎం, సిఎం, రాష్ట్ర మంత్రుల పర్యటనల సందర్భంగా ముందుగా సిపిఎం నాయకులను నిర్బంధించడం, అరెస్టులు చేయడం పరిపాటిగా మారిందని తెలిపారు. గతంలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఎటువంటి అరెస్టులూ, గృహ నిర్బంధాలూ ఉండవని ప్రగల్భాలు పలికి నేడు అందుకు భిన్నంగా వ్యవహరించడాన్ని చూస్తే వారి మాటలకు, చేతలకు ఎంత తేడా ఉందో ఇట్టే అర్థమవుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడం లేదని, నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేయడంలేదని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఉక్కు ప్రైవేటీకరణ విరమించుకోవాల్సిందే..

(మొదటి పేజీ తరువాయి..) పెద్ద సంఖ్యలో కార్మికవర్గం తరలివచ్చింది. దీక్షలను ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు జె.అయోధ్యరాం, కెఎం.శ్రీనివాసరావు, డి.ఆదినారాయణ, యు.రామస్వామి, వైటి.దాస్ మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి, పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని, అవసరమైన ఆర్థిక సహకారం అందించాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను విస్తరించి నిర్వాసితులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. నాలుగు నెలలుగా జీతాలు అందక ఇబ్బందులు పడుతున్న కార్మికులకు తక్షణమే వేతనాలు అందివ్వాలన్నారు. దీక్షలో పోరాట కమిటీ ఛైర్మన్ మంత్రి రాజశేఖర్, నాయకులు కెఎస్‌ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు, దాసరి సురేష్ బాబు, ఎన్.రామారావు, మాటూరు శ్రీనివాసరావు, డివి.రమణారెడ్డి, వరసాల శ్రీనివాసరావు, కారు రమణ, రమణమూర్తి, టివికె.రాజు, దాసరి శ్రీనివాస్, డి.ప్రసాద్, శివ పాల్గొన్నారు.

వామపక్షాల ధర్నా

స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని రద్దు చేస్తున్నట్టు, సొంతగనులు కేటాయిస్తున్నట్టు, ప్లాంట్‌ను పూర్తిస్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో నడిపించేందుకు అన్ని వనరులు కేటాయిస్తున్నట్టు ప్రధాని మోడీ విశాఖ వేదికగా స్పష్టమైన ప్రకటన చేయాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ ఈ ధర్నాను ప్రారంభించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిళ్ళ పైడిరాజు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, సిపిఐ ఎంఎల్ ప్రజాపోరు జిల్లా నాయకులు సిహెచ్.దేవా, ఎంసిపిఐ జిల్లా నాయకులు శంకరరావు, ఎస్‌యుసిఐసి రాష్ట్ర నాయకులు ఎస్.గోవిందరాజులు మాట్లాడారు. నాలుగేళ్ళుగా విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం పోరాడుతుంటే ప్రధానికి పట్టకపోవడం దారుణమన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో రెండేళ్ల కిందట ఇదే ఆంధ్రా యూనివర్శిటీ గ్రౌండ్‌కు మోడీ వచ్చేటప్పుడు ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్ మోడీ స్పష్టమైన ప్రకటన చేయాలని చేసిన డిమాండ్‌ను గుర్తుంచుకోవాలన్నారు. ఈ రెండేళ్లలో స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేస్‌లను మూసివేసి ఉత్పత్తి తగ్గించే కుట్రలు పన్నడమేకాకుండా, ఉద్యోగులకు, కార్మికులకు జీతాలు చెల్లించకుండా తీవ్ర ద్రోహానికి ఒడిగట్టారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌లు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని ప్రకటనలు చేస్తున్నారే తప్ప కేంద్ర మోడీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు ఇవ్వడంలేదన్నారు. పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్‌ను నడవనివ్వడం లేదని విమర్శించారు. ప్లాంట్‌లో 5 వేల పోస్టుల భర్తీకి అవకాశం ఉన్నప్పటికీ ఉన్న పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులను తొలగించడానికి యాజమాన్యం పూనుకుంటోందన్నారు. ఇటీవల ఢిల్లీలో ప్రధానితో సమావేశమైన ముఖ్యమంత్రి విశాఖ ఉక్కు కోసం కాకుండా మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు ఇనుప ఖనిజాన్ని అంతరాయం లేకుండా సరఫరా చేయాలని, ప్లాంట్ ఏర్పాటుకు అన్ని అనుమతులు త్వరగా అందేలా చర్యలు చేపట్టాలని కోరడం అత్యంత ఆందోళన కలిగించే అంశమన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.జగన్, బి.పద్మ, పి.మణి, వి.కృష్ణారావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జిఎస్‌జె.అచ్యుతరావు, ఎం.మన్మథరావు, పి.చంద్రశేఖర్, క్షేత్రపాల్ రెడ్డి, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు వై.కొండయ్య, ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, సిఐటియు నాయకులు వై.రాజు, ఎం.సుబ్బారావు, ఎస్.జ్యోతీశ్వరరావు, కుమార్ మంగళం, జి.అప్పలరాజు, ఎపి మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఎమ్‌డి.బేగం, తదితరులు పాల్గొన్నారు. ప్రజానాట్య మండలి కార్యకర్తలు విప్లవ గీతాలు ఆలపించారు.

హైడ్రో పవర్ ప్లాంట్ల అనుమతులు రద్దు చేయాలి


అదానీ చిత్రపటాలను దగ్ధం చేస్తున్న సిపిఎం నాయకులు, గిరిజనులు

ప్రజాశక్తి – దేవరాపల్లి

ఈ నెల 8న విశాఖ పర్యటనకు వస్తున్న ప్రధాని మోడీ అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలంలోని నగరంపాలెం, చింతలపూడి ప్రాంతాల్లో అదానీ గ్రూపునకు చెందిన హైడ్రో పవర్ ప్లాంట్ల అనుమతులను రద్దు చేస్తూ ప్రకటన చేయాలంటూ నగరంపాలెం ప్రాంతంలో సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. అడ్డాకుల టోపీలు ధరించి, విల్లంభులు ఎక్కుపెట్టి ఈ ఆందోళన చేపట్టారు. అదానీ చిత్రపటాలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి బిటి.దొర మాట్లాడుతూ హైడ్రో పవర్ ప్లాంట్లు నిర్మాణం చేసి గిరిజనులను ముంచుతారా ? అని ప్రశ్నించారు. ఈ ప్లాంట్లకు వ్యతిరేకంగా కొంత కాలంగా గిరిజనులు ఆందోళన చేస్తున్నా పట్టించుకోకుండా అనుమతులు ఇవ్వడం, రహస్య సర్వే చేపట్టడం దారుణమన్నారు. నగరంపాలెం గ్రామానికి జల్ జీవన్ మిషన్‌లో మంచి నీళ్లు మంజూరు చేస్తే ఆ ప్రాంతం ఫారెస్ట్ ఏరియాలో ఉందని పైపులైన్ వేయకుండా అడ్డుకున్న అధికారులు దట్టమైన అటవీ ప్రాంతాన్ని అదానీకి ఎలా కట్టబెడుతున్నారని ప్రశ్నించారు. అదానీ కన్ను రైవాడ, కోణాం ప్రాజెక్టులపై పడిందని తెలిపారు. అవి రెండూ అదానీపరమైతే ఈ ప్రాంత గిరిజనులు, స్థానికుల బతుకులు బుగ్గిపాలవుతాయన్నారు. ఆయకట్టు భూములు ఎడారిగా మారబోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అదానీ కంపెనీకి చెందిన ఏజెంట్లు దేవరాపల్లిలో ఆఫీసుల నిర్మాణం కోసం భూ పరిశీలన మొదలు పెట్టారని తెలిపారు. హైడ్రో పవర్ ప్లాంట్ల ప్రభావిత ప్రాంతాల వాసులంతా ఐక్యమై ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో తామర్ల కొండబాబు, రాజు, మహేష్, సుకూరి రామకృష్ణ, తామర్ల బుచ్చిబాబు, మామిడి రవికుమార్, గిరిజనులు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీ, మెషిన్ లెర్నింగ్‌పై నైపుణ్యం

ప్రజాశక్తి -మధురవాడ : ఐటి, పారిశ్రామిక రంగాలలో మెషిన్‌లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ అంశాలకు పెరుగుతున్న ప్రాధాన్యత దృష్ట్యా విశ్వవిద్యాలయాలలోని అధ్యాపకులకు వీటిపై నైపుణ్యత పెరగాల్సిన అవసరం ఉందని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ వై.గౌతమ్‌రావు పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఇఇసిఇ విభాగం ఆధ్వర్యాన మెషిన్‌లెర్నింగ్ ఆధారిత సిగ్నల్ ప్రాసెసింగ్, సైబర్ సెక్యూరిటీ అల్గారిథమ్స్ అంశంపై అధ్యాపకులకు శిక్షణను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఇంజినీరింగ్ విద్యలో అన్ని కోర్సులలోను మెషిన్‌లెర్నింగ్, కృత్రిమ మేధ అంశాలను బోధిస్తున్న నేపథ్యంలో అధ్యాపకులు నిరంతర అధ్యయనం ద్వారా ఈ అంశాలపై లోతైన పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమానికి బెంగళూరులోని ప్రఖ్యాత ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ శాస్త్రవేత్త డాక్టర్ కె.సోలమన్‌రాజు ప్రధాన వక్తగా హాజరయ్యారు. బిగ్‌డేటా రంగం ప్రయోజనాలను ఆయన వివరిస్తూ ప్రస్తుత డిజిటల్ యుగంలో సమాచార సేకరణ ఎంత ముఖ్యమో సమాచార భద్రత అంతే కీలకమని తెలిపారు. అధ్యాపకులు విద్యార్థులలో నూతన ఆలోచనలను రేకెత్తించే విధంగా తరగతి గదిలో బోధన చేయాలని సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ కె.నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ, సాంకేతిక ప్రగతిపై విద్యార్థులు లోతైన అవగాహన కలిగి ఉండాలని, నూతన ఆవిష్కరణలపై దృష్టి ఉంచాలని, పరిశోధనల ద్వారా ప్రగతిలో పాలు పంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ డీన్ ప్రొఫెసర్ వి.రామశాస్త్రి, ఇఇసిఇ విభాగాధిపతి ప్రొఫెసర్ పి.భరణి చంద్రకుమార్, ఎఫ్‌డిపి కన్వీనర్లు డాక్టర్ జి.అనిత, డాక్టర్ కె.రేణు, డాక్టర్ ఐ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అతిథులను సన్మానిస్తున్న గీతం ప్రతినిధులు

నేరాలు ఘోరాలు

వాహనం ఢీకొని యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి -గాజువాక : గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒక యువకుడు దుర్మరణం చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పాత గాజువాక జంక్షన్లో మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం.. శ్రీకాకుళం చెందిన కొనబిల్లి రమేష్ (24) అక్కిరెడ్డిపాలెంలో నివాసముంటున్నారు. ఫార్మా కంపెనీలో పనిచేస్తున్న కొనబిల్లి రమేష్ మంగళవారం ఉదయం డ్యూటీకి బయలుదేరాడు. పాత గాజువాక జంక్షన్లో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మరో వ్యక్తి శ్రీనివాస్‌కు (41) తీవ్ర గాయాలయ్యాయి. గాజువాక సిఐ పార్థసారథి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు.



మృతిచెందిన రమేష్



జెసిఎల్‌కు వినతి పత్రం అందిస్తున్న కార్మిక సంఘాల ప్రతినిధులు

బకాయిల చెల్లింపుపై జెసిఎల్‌కు వినతి

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జ్యూట్ మిల్లు కార్మికులకు బకాయిపడిన గ్రాట్యుటీ, నష్టపరిహారం చెల్లించేలా యాజమాన్యాన్ని ఆదేశించాలని కోరుతూ జ్యూట్ మిల్లు కార్మిక సంఘాలైన కాకాస, ఎఐటియుసి, టిఎన్‌టియుసి ప్రతినిధులు మంగళవారం విశాఖ నగరంలోని కార్మిక శాఖ కార్యాలయంలో జెసిఎల్ రామారావుకు వినతిపత్రం అందజేశారు. జ్యూట్ కార్మికులందరికీ పూర్తి స్థాయిలో చెల్లింపులు జరిపేలా యాజమాన్యంపై ఒత్తిడి తీసుకు రావాలని కోరారు. జెసిఎల్‌ను కలిసిన వారిలో ఆయా సంఘాల ప్రతినిధులు దల్లి అప్పలరెడ్డి, ఎం.ఆదినారాయణ, కొండపు ఈశ్వరరావు, కె.రాంబాబు, ఎంవి.గురుమూర్తి, ఎన్.రామారావు ఉన్నారు.

పిఎన్‌ఎం నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -తగరపువలస : ప్రజానాట్య మండలి భీమిలి జోన్ కమిటీ నూతన కార్యవర్గం మంగళవారం ఎన్నికైంది. గౌరవాధ్యక్షులుగా దల్లి రాంబాబు, అధ్యక్షులుగా పల్లా పోతురాజు, ఉపాధ్యక్షులుగా చిల్ల అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా బెల్లాన రామకృష్ణ, కోశాధికారిగా పంపాన సూర్యనారాయణ, పలువురు కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు

చదువు, సామాజిక అంశాలపై అవగాహన

ఫ్రెషర్స్ డే వేడుకల్లో ముత్తంశెట్టి



ఫ్రెషర్స్ డే వేడుకలను ప్రారంభిస్తున్న అవంతి విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -తగరపువలస : చదువుతో పాటు సామాజిక అంశాలపై విద్యార్థులు దృష్టి సారించాలని మాజీ మంత్రి, అవంతి విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక అవంతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో బి.ఫార్మసీ, ఫార్మ డి మొదటి ఏడాది విద్యార్థులను ఆహ్వానించేందుకు ఏర్పాటుచేసిన కార్యక్రమాన్ని ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫార్మసీ రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. నైపుణ్యంతో కూడిన విద్యను అందించి వారిని ఉన్నత స్థాయికి చేర్చేందుకు కృషి చేస్తామని చెప్పారు. గౌరవ అతిథిగా హాజరైన సెంట్రల్ యూనివర్సిటీ గౌరవ ఉప కులపతి ప్రొఫెసర్ తేజస్వి వెంకప్ప కట్టమణి మాట్లాడుతూ, ఫార్మసీ రంగం ప్రాధాన్యతను వివరించారు. ఔత్సాహిక వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఆంధ్రా యూనివర్సిటీ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వి.గిరిజాశాస్త్రి మాట్లాడుతూ, ఫార్మసీ రంగంపై అభిరుచి పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. అవంతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎంబి.వెంకటపతిరాజు మాట్లాడుతూ, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



పరిశీలిస్తున్న ఎస్ఐ సన్నిబాబు

న్యాయంపూడిలో చోరీ

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని న్యాయంపూడి గ్రామంలో జాతీయ రహదారికి అనుకుని ఉన్న ఇంటిలో దొంగలు చొరబడి బంగారం, వెండి, నగదు దోచుకున్నట్లు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు ప్రవేశించి బీరువాలో ఉన్న నాలుగు తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.10 వేల నగదు అపహరించుకుపోయారనిఇంటి యజమాని నాగనబోయిన వెంకటరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు, ఎస్ఐ సన్నిబాబు, క్లూస్ టీం పరిశీలించారు. సిసి కెమెరాల ఫుటేజీ పరిశీలిస్తామని ఎస్ఐ వెల్లడించారు. సర్పంచ్ రెడ్డి వరహాలు బాబు, పోలీసులు పాల్గొన్నారు.

నైపుణ్యానికి ప్రతీక సివిల్ ఇంజినీరింగ్

ప్రజాశక్తి -మధురవాడ : ప్రపంచంలోని నిలువెత్తు భవనాలు, భారీ వంతెనలు, ఆకట్టుకునే కట్టడాల వెనుక సివిల్ ఇంజినీరింగ్ నిపుణుల నైపుణ్యత దాగి ఉందని, రానున్న రోజులలో సివిల్ ఇంజినీరింగ్‌కు మరింత ప్రాధాన్యత పెరగనుందని ఎన్ఐటి రాయపూర్, ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్‌వి.రమణారావు పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ, ఇంజినీరింగ్ విద్యలో ఎన్ని కొత్త కోర్సులు వచ్చినప్పటికి సివిల్ ఇంజినీరింగ్ నిపుణులకు డిమాండ్ ఉంటుందన్నారు. సృజనాత్మకతను ప్రదర్శించడానికి సివిల్ ఇంజినీరింగ్‌లో అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ప్రపంచంలోని వివిధ దేశాలలో ఆకాశాన్ని అంటే భారీ నిర్మాణాలను రూపొందించడంలో సివిల్ ఇంజినీరింగ్ నిపుణుల నైపుణ్యం ఎంతో ఉందన్నారు. ప్రకృతి విపత్తులను తట్టుకుని నిలిచే విధంగా నిర్మాణాలను డిజైనింగ్ చేయడంలో సివిల్ ఇంజినీరింగ్ నిపుణులు అనుసరిస్తున్న వివిధ పద్ధతులను ఆయన వివరించారు. ఏదైనా భారీ కట్టడాలను సందర్శించినప్పుడు సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు ఇంజినీరింగ్ పర్యాటకుల కోణంలో అధ్యయనం చేయాలని సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ కె.నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ, శరీరాన్ని యోగా ప్రక్రియలో ఏవిధంగా సమతుల్యతతో ఉంచుతామో సివిల్ ఇంజినీరింగ్‌లో డిజైనింగ్ నుంచి కట్టడం పూర్తయ్యేవరకు అదే విధమైన నిలకడలను ప్రదర్శించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ డి.ముకుందరావు, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.చెందన కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సివిల్ ఇంజినీరింగ్‌పై మాట్లాడుతున్న అతిథులు

నూతన విద్యా విధానం అమలుపై అవగాహన

ప్రజాశక్తి -తగరపువలస : నూతన విద్యా విధానం అమలుపై స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకులు, వివిధ విభాగాల అధిపతులకు మంగళవారం అవగాహన కల్పించారు. రాయపూర్ ఎన్ఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్‌వి.రమణారావు మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం నింపడానికి, అభ్యసన స్థాయి పెరగడానికి నూతన విద్యా విధానం దోహద పడుతుందన్నారు. పరిశోధనలకు అనుగుణంగా బహుళ ప్రయోజనాలు అందిపుచ్చుకోవడానికి ఉపయోగ పడుతుందన్నారు.

అవంతి విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు పెంపొందించడానికి నూతన విద్యా విధానం ఉపయోగ పడుతుందన్నారు. ఈ సమావేశంలో మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ యు.రాము, ప్రిన్సిపల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ డాక్టర్ ఎ.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని సంక్రాంతి పండగను పురస్కరించుకొని ఈ నెల 11, 12, 13 తేదీల్లో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు పద్మనాభం మండల పరిషత్ అధ్యక్షులు కె.రాంబాబు తెలిపారు. ఈ పోటీల్లో విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన 25 సంవత్సరాలలోపు యువకుల పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆటలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. మొదటి బహుమతి రూ.7000, రెండో బహుమతి రూ.5000, మూడో బహుమతి రూ.3000 ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో అందరూ ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు.

కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -మధురవాడ : రాష్ట్ర కాళింగ సంక్షేమాభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన మధురవాడకు చెందిన మామిడి దుర్గారావు బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ తాడేపల్లిలోని సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో సంబంధిత కార్పొరేషన్ అధ్యక్షులు రోణంకి కృష్ణంనాయుడు ఆధ్వర్యాన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఈ పదవికి ఎంపిక చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు, ఏడోవార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.



ఫణికుమార్ పార్థివదేహం వద్ద కుటుంబీకులను ఓదార్చుతున్న పల్లా

ఫణి కుమార్ పార్థివ దేహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే పల్లా

ప్రజాశక్తి -గాజువాక : ఉన్నత విద్య కోసం కెనడా వెళ్లి మృతి చెందిన ఫణికుమార్ పార్థివ దేహాన్ని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సందర్శించారు. చట్టివానిపాలెం ప్రాంతానికి చెందిన పిల్లి ఫణికుమార్ భౌతికకాయం సోమవారం రాత్రి విశాఖ చేరుకుంది. ఫణికుమార్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చి ధైర్యం చెప్పారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



డిగ్రీ కళాశాల సంబరాల్లో బహుమతులు అందిస్తున్న యాజమాన్య ప్రతినిధులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎస్‌విఎల్‌ఎన్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం సంక్రాంతి సంబరాలు జరిపారు. ముగ్గులు, గాలి పటాల పోటీలు నిర్వహించారు. భోగి మంటలు వేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ సిహెచ్.విష్ణుమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందిస్తున్న దృశ్యం

ఉత్సాహంగా రంగోత్సవ పోటీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో మంగళవారం ఉత్సాహంగా ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి రంగోత్సవ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా డైట్ ప్రిన్సిపల్ ఎం.జ్యోతికుమారి మాట్లాడుతూ, విద్యార్థుల్లో జాతీయ సమైక్యత, సృజనాత్మకత, భాషాభివృద్ధి అంశాల్లో నైపుణ్యాలు పెంపొందించే ఉద్దేశంతో భారత ప్రభుత్వం సమగ్ర శిక్ష ద్వారా రంగోత్సవ పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు సంపాదించాలని విద్యార్థులను కోరారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని 10 పాఠశాలల నుంచి 6 నుంచి 12వ తరగతి చదువుతున్న 150 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు.

క్విజ్ పోటీల్లో నడుపూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు, చిత్ర లేఖనంలో పద్మనాభం మండలం కెజిబివి విద్యార్థిని, చేతిరాత, రంగోలి పోటీల్లో స్థానిక కెజిబివి విద్యార్థిని, జానపద నృత్యంలో ఆరిపాక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానాల్లో ఎంపికయ్యారని నిర్వాహకులు తెలిపారు. వీరంతా ఈ నెల 24న విజయవాడలో జరుగు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారని పేర్కొన్నారు. డైట్ అధ్యాపకులు ఎల్.సుధాకర్, జిజిఎస్.నాగేశ్వరరావు, ఎస్.త్రినాథరావు, జె.మాధవి, ఎం.మహాలక్ష్మి, ఎ.సోమయాజులు, ఎన్.నీలిమ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ద్రోహం తలపెట్టిన...

టిజి.భరత్‌ను మంత్రి పదవి నుంచి తొలగించాలి

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్ ముడి ఇనుప గనుల గురించి ఇప్పటి వరకు నోరు మెదపని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్ ఏకంగా ఆర్సిలార్ మిట్టల్‌కు ఏజెంట్‌గా మారి విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ద్రోహం తలపెట్టారని, తక్షణమే ఆ పదవి నుంచి ఆయన్ను తొలగించాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్‌చేశారు. కేంద్ర స్టీల్ మంత్రి కుమారస్వామిని సోమవారం ఆయన కలిసి ఆంధ్ర రాష్ట్రంలో ఏర్పాటు చేయబోయే ఆర్సిలార్ మిట్టల్ స్టీల్ పరిశ్రమకు నిరాటకంగా ముడి ఇనుప ఖనిజం సరఫరా చేసేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరటంతో పాటు తక్షణం పరిశ్రమకు అన్ని అనుమతులు ఇవ్వాలని కోరుతూ, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు హాని చేశారని, మంత్రి చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు.

గత అసెంబ్లీ ఎన్నికల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కానివ్వబోమని, సెయిల్‌లో విలీనం చేయిస్తామని, సొంత ముడి ఇనుప ఖనిజం గనులు కేటాయిస్తామని, క్యాపిటల్ రీస్ట్రక్చరింగ్ కింద రూ.18 వేల కోట్లు మంజూరు చేపించే చర్యలు చేపడతామని రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన వాగ్దానం గాలికొదిలేసి, ముఖ్యమంత్రి చంద్రబాబు మిట్టల్ స్టీల్ ప్లాంట్‌ను పక్కలో బల్లెంలా విశాఖ స్టీల్ ప్లాంట్ పక్కన పెట్టటానికి తహ తహ లాడుతున్నారని విమర్శించారు. ఇటీవల ప్రధాన మంత్రిని కలిసి విశాఖ స్టీల్ ప్లాంట్‌పై ఒక్క మాటకూడా మాట్లాడకుండా, మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు ముడి ఇనుప గనులు సరఫరాకు, పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన అనుమతులు వెంటనే ఇవ్వాలని కోరారన్నారు. ఇప్పుడు మంత్రివర్గంలోని దూతలను కేంద్ర మంత్రులు దగ్గరికి పంపి మిట్టల్‌కు సాగిలపడి అన్ని అనుమతులు దగ్గరుండి ఇప్పించేందుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ చర్యలు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను దెబ్బ తీయటానికేనని స్పష్టమవుతుందన్నారు. ఈ ద్రోహాన్ని ప్రజలందరూ ఖండించాలని విజ్ఞప్తి చేశారు.

జీతాలు చెల్లించాలని...

ఎంజిఎం సెవెన్ హిల్స్ కార్మికుల భిక్షాటన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : బకాయి జీతాలను చెల్లించాలని కోరుతూ ఎంజిఎం సెవెన్ హిల్స్ హాస్పిటల్ కార్మికులు మంగళవారం భిక్షాటన చేపట్టారు. సెవెన్ హిల్స్ హాస్పిటల్ నుంచి జగదాంబ జంక్షన్ వరకు నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి విశాఖ హాస్పిటల్, నర్సింగ్ హోమ్స్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి వై.రాజు మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ సమయంలో ఎంజిఎం సెవెన్ హిల్స్ హాస్పిటల్ యాజమాన్యం కక్షపూరితంగా కార్మికుల జీతాలను ఆపివేసిందని విమర్శించారు. లేబర్ ఆఫీసర్ నోటీసులు పంపించినప్పటికీ స్పందించకుండా అమానవీయంగా ప్రవర్తిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అతి తక్కువ జీతం తీసుకుంటూ, ఇంటి అద్దె, కరెంట్ బిల్లులు, పిల్లల స్కూల్ ఫీజులు, నిత్యవసర సరుకుల భారాలతో జీవనం సాగిస్తున్న కార్మికులు పండుగ పూట భిక్షాటన చేసుకునే దుస్థితికి హాస్పటల్ యాజమాన్యం తీసుకొచ్చిందని విమర్శించారు. సమస్యను వెంటనే పరిష్కరించి కార్మికులకు రావాల్సిన జీతాలు చెల్లించాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రజలు స్పందించి విరివిగా విరాళాలు ఇచ్చి తమ ఉద్యమానికి మద్దతుగా నిలిచినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సిహెచ్.నూకరాజు, పుష్ప, తిలోమని, వెంకటలక్ష్మి, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



భిక్షాటన చేస్తున్న సెవెన్ హిల్స్ కార్మికులు

'సుగర్ వ్యాధి నివారణకు యోగా దోహదం'

ప్రజాశక్తి- వేపగుంట : సుగర్ వ్యాధి నివారణకు యోగా దోహదపడుతుందని జివిఎంసి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పేర్కొన్నారు. 52వ వార్డు శాంతినగర్ ప్రాంతంలో పతాంజలి యోగా సమితి ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఉచిత సుగర్ వ్యాధి నివారణ చికిత్స కేంద్రాన్ని శ్రీధర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక ఆరోగ్యానికి, మెరుగైన జీవనానికి యోగా అత్యంత శక్తివంతమైవ ఆయుధంగా పనిచేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ యోగా చేయడం జీవన విధానంలో ఒక అలవాటుగా చేసుకోవాలని సూచించారు.



యోగా కేంద్రంలో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

ఎన్ఎడి ఉద్యమానికి ఎఐడిఇఎఫ్ మద్దతు

◆ సస్పెన్షన్, పోలీసు కేసులు ఎత్తివేయాలి : శ్రీకుమార్

ప్రజాశక్తి -గోపాలపట్నం : ఎన్ఎడి యాజమాన్యం చర్చలకు పిలిచి ఆరుగురిపై పోలీసు కేసు, 36 మందిని సస్పెండ్ చేయడాన్ని అఖిలభారత రక్షణ ఉద్యోగుల ఫెడరేషన్ (ఎఐడిఇఎఫ్) ప్రధాన కార్యదర్శి శ్రీకుమార్ తీవ్రంగా ఖండించారు. ఢిల్లీ నుంచి విశాఖపట్నం మంగళవారం వచ్చిన శ్రీకుమార్ ఎన్ఎడి గేటు వద్ద ఉన్న దీక్షా శిబిరాన్ని సందర్శించి సంపూర్ణ మద్దతు తెలిపారు. దీక్షలో కూర్చున్న కార్మికులను, సస్పెన్షన్‌కు గురైన నాయకులు, కార్యకర్తలను కలుసుకున్నారు. ఫెడరేషన్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. గత కొంత కాలంగా రక్షణ రంగ ఉద్యోగులపై ఆయా యాజమాన్యాలు కక్ష సాధింపు చర్యలకు పూనుకుంటున్నాయని, వీటిని ఎదుర్కొని ట్రేడ్ యూనియన్ ఉద్యమం నిలబడిందని, ఇటువంటివి ఫెడరేషన్‌కు కొత్త కాదని శ్రీకుమార్ తెలిపారు.

అనంతరం 11 గంటలకు ఎన్ఎడి చీఫ్ జనరల్ మేనేజర్ దివాకర్ జయంతిని కలిసి మాట్లాడారు. ఈ రోజే చార్జిషీట్లు ఇచ్చినందున సస్పెన్షన్లను ఎత్తివేయాలని కోరారు. పరిశ్రమ ఉత్పత్తి కార్యకలాపాలకు ఇంతమందిని దూరంగా ఉంచడం మంచిది కాదని చెప్పారు.

నేవల్ బేస్‌లో చీఫ్ సివిలియన్ పర్సనల్ ఆఫీసర్ రాయ్‌ను కలిసి ఎన్ఎడి పరిణామాలను వివరించారు. ఇచ్చిన ఛార్జిషీట్లపై విచారణకు సహకరిస్తామని, సస్పెన్షన్లు ఎత్తివేసేలా చూడాలని కోరారు. జరిగిన పరిణామాలను ఫ్లాగ్ ఆఫీసర్‌కు వివరించి ఎన్ఎడిలో ప్రశాంత వాతావరణానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులు చేసిన ఓటీకి పేమెంట్లు జరిగేలా బాధ్యత తీసుకోవాలని కమాండ్ అధికారులను శ్రీకుమార్ కోరారు. సస్పెన్షన్లు ఎత్తివేసేవరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టంచేశారు. పోరాటానికి అఖిల భారత స్థాయిలో అన్ని రకాల సహాయ, సహకారాలు అందిస్తామని ఎన్ఎడి కార్మికులకు భరోసా ఇచ్చారు.

విశాఖ రక్షణ రంగ, ఎన్ఎడి అధికారులతో చర్చలు జరపడంతో పాటు కార్మికులకు మనోధైర్యాన్ని ఇచ్చిన శ్రీకుమార్‌కు ఎన్ఎడి యూనియన్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపింది. ఈ కార్యక్రమంలో ఎఐడిఇఎఫ్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు పి.గోపాలకృష్ణ, జెసిఎం-3 సభ్యులు, ఎన్ఎడి యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



ఎన్ఎడి కార్మికుల సత్యాగ్రహ దీక్షకు మద్దతుగా కూర్చున్న ఎఐడిఇఎఫ్ ప్రధాన కార్యదర్శి శ్రీకుమార్

సిపిఎం ఎదుగుదలకు బాలకృష్ణ కృషి ఎనలేనిది

ప్రథమ వర్ధంతి సభలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు



కామ్రేడ్ ఎ.బాలకృష్ణ ప్రథమ వర్ధంతి సభలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉమ్మడి విశాఖ జిల్లాలోని గ్రామీణ ప్రాంతంలో సిపిఎం ఎదుగుదలకు కామ్రేడ్ ఎ.బాలకృష్ణ చేసిన కృషి ఎనలేనిదని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. సిపిఎం సీనియర్ నేత, ప్రజా నాయకుడు కామ్రేడ్ ఎ.బాలకృష్ణ ప్రథమ వర్ధంతి సందర్భంగా సిపిఎం కార్యాలయంలో మంగళవారం ఆయన చిత్రపటానికి కోటేశ్వరరావు, సీనియర్ నాయకులు నాగేశ్వరరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఎస్ఈజెడ్, ఎన్ఏఓబి నిర్వాసితుల తరుపున, నల్ల బెల్లం, సుగర్ ఫ్యాక్టరీలు, రైవాడ రైతులు, రైతు, కౌలు రైతుల సమస్యలపైనా బాలకృష్ణ అనేక పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. విద్యార్థి దశలోనే వామపక్ష భావాలకు ఆకర్షితులై చివరి వరకూ తను నమ్మిన ఆశయ సాధనకు కృషి చేశారన్నారు. ప్రజలకు ఏ చిన్న సమస్య వచ్చినా తానున్నానని వెంటనే భరోసాగా నిలబడేవారని తెలిపారు. నేడు బాలకృష్ణ మన మధ్య లేకపోవడం ఉద్యమానికి తీవ్ర లోటన్నారు. నేడు ప్రభుత్వం తీసుకొస్తున్న రైతు వ్యతిరేక, కార్మిక వ్యతిరేక చట్టాలపై పోరాడటమే ఆయనకు మనం ఇచ్చే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు పెంటకోట శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు బి.ఉమామహేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.శంకరరావు, జిల్లా కమిటీ సభ్యులు వివి.శ్రీనివాసరావు, అల్లు రాజు, గంటా సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి : మండలంలోని రేగుపాలెంలో రైతు నాయకులు ఎ.బాలకృష్ణ చిత్ర పటానికి ఆశా వర్కర్లు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి చింతకాయల శివాజీ, ఆశా వర్కర్ల సంఘం కార్యదర్శి లక్ష్మి, ఆశాలు కనకకుమారి, వరలక్ష్మి, బీబీరాణి, కుమారి, సత్యవతి, రమణకుమారి, రత్నవేణి తదితరులు పాల్గొన్నారు.

చోడవరం : రైతు సంఘం నేత, ఎ.బాలకృష్ణ ప్రథమ వర్ధంతి సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం చోడవరంలో నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, ఎస్వి నాయుడు, కె.వరలక్ష్మి, చంద్రశేఖర్, దేముడు, చంద్రరావు తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. జిల్లాలో చెరుకు రైతులు, కౌలు రైతుల సమస్యలపైనా బాలకృష్ణ చివరి వరకు అనేక ఉద్యమాలు నిర్వహించారని నాయకులు తెలిపారు.



మునగపాకలో బాలకృష్ణకు నివాళులర్పిస్తున్న ఆశా వర్కర్లు

పరవాడ : రైతు సంఘం నాయకులు ఎ.బాలకృష్ణ ప్రథమ వర్ధంతి మంగళవారం మండలంలోని వాడచీపురుపల్లి పిహెచ్‌సి వద్ద, వాడచీపురుపల్లి గ్రామంలోనూ నిర్వహించారు. బాలకృష్ణ చిత్రపటానికి ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం, ఆశా యూనియన్ నాయకురాలు సిహెచ్.ముత్యాలమ్మ పూలమాలేసి ఘనంగా నివాళులర్పించారు. అనకాపల్లిలో మున్సిపల్ కార్మికుల సమస్యలపై బాలకృష్ణ చేసిన పోరాటాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, నాయకులు కె.ఆదిలక్ష్మి, ఎ.వరలక్ష్మి, ఈ.పరదేశమ్మ, మౌనిక పాల్గొన్నారు.

మునగపాక : స్థానిక పిహెచ్‌సి ఆవరణలో రైతు నాయకులు ఎ.బాలకృష్ణ ప్రథమ వర్ధంతి మంగళవారం ఘనంగా జరిగింది. బాలకృష్ణ చిత్ర పటానికి సిఐటియు నాయకులు ఎస్ బ్రహ్మాజీ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కౌలు రైతు సంఘం నాయకుడిగా బాలకృష్ణ ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించారన్నారు. కార్యక్రమంలో ఆశాలు ఈశ్వరపు పార్వతి, మద్దాల జయ పద్మ, కుమారి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో సిపిఎం జిల్లా సీనియర్ నాయకలు ఎ. బాలకృష్ణ ప్రథమ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. బాలకృష్ణ చిత్రపటానికి ఎల్.గౌరి, కెవి సూర్యప్రభ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటి సభ్యుడు అడిగర్ల రాజు మాట్లాడుతూ సిపిఎం నేత బాలకృష్ణ నిరంతరం ప్రజా సమస్యలపై పనిచేసారన్నారు. రానున్న రోజుల్లో బాలకృష్ణ సూచించిన మార్గంలో పయనిస్తూ, ప్రజాశ్రేయస్సుకు, ఆయన ఆశయసాధనకు కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకలు ఈరెల్లి చిరంజీవి, టి ఈశ్వరరావు, కె రామకృష్ణ పాల్గొన్నారు.



నర్సీపట్నంలో నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు, కార్మికులు



గాయత్రిని అభినందిస్తున్న కళాశాల అధ్యాపకులు

జాతీయస్థాయి రెజ్లింగ్‌లో గాయత్రికి గోల్డ్ మెడల్

ప్రజాశక్తి-చోడవరం

చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎంపీసీ కంప్యూటర్స్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని గాయత్రి జాతీయ మహిళల రెజ్లింగ్ పోటీలలో గోల్డ్ మెడల్ సాధించింది. ఇటీవల విజయవాడలో జరిగిన జాతీయ స్థాయి మహిళా రెజ్లింగ్ పోటీల్లో గాయత్రి పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ మేరకు గాయత్రిని మంగళవారం డాక్టర్ పి.కిరణ్ కుమార్ ఇతర అధ్యాపక బృందం అభినందించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ గాయత్రి ఆటల్లోనే కాకుండా చదువులోనూ చక్కటి ప్రతిభ కనపర్చుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిడి మూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డి.మాల్యాద్రి, డాక్టర్ రత్న భారతి, పిచ్చమ్మ, వి.అప్పలనాయుడు, హెచ్ సుధీర్, డాక్టర్ మల్లి బాబు, నారాయణ మూర్తి, డాక్టర్ కృష్ణారావు, డాక్టర్ సూర్యవతి, డాక్టర్ జ్యోతి, డాక్టర్ లక్ష్మీ మంగమ్మ, జి వెంకటేష్, రామలక్ష్మి, సరస్వతి కోమల, తాతారావు, శ్రీనివాసరావు, రాజేష్ పాల్గొన్నారు.

స్కీమ్ వర్కర్లకు వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : స్కీమ్ వర్కర్లకు వేతనాలు తక్షణమే పెంచాలని ఏపీ స్కీమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్‌డివో కార్యాలయం ఏవో సుధాకర్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికుల తదదితర స్కీమ్ వర్కర్లు కీలకంగా పనిచేస్తున్నారని తెలిపారు. వారికి వేతనాల పెంపుదలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆరోపించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెన్షన్, గ్రాట్యుటీ, పీఎఫ్, ఈఎస్ఐ, హెల్త్ కార్డు సౌకర్యాలు కల్పించాలని, ప్రతి నెల 5వ తేదీలోగా వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వాయిబోయిన శేఖర్, కాండ్రేగుల మహాలక్ష్మి నాయుడు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కొణతాలను కలిసిన వర్మ

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన ఏర్పాట్లు నిమిత్తం అనకాపల్లి వచ్చిన పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ఎస్వీఎస్.వర్మ మంగళవారం స్థానిక జనసేన పార్టీ కార్యలయంలో అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామకృష్ణ వర్మని శాలువతో సత్కరించి ఆహ్వానించారు. అనంతరం ప్రధాని పర్యటనపై అధికారులతో చర్చలు జరిపారు.

కబడ్డీ పోటీల్లో రన్నర్స్‌గా డైట్ విద్యార్థులు

ప్రజాశక్తి-అనకాపల్లి : విశాఖపట్నం గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో ఇటీవల జరిగిన ఇంటర్ పాలిటెక్నికల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీటిలో స్థానిక దాడి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు కబడ్డీ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించారు. తమ కళాశాల విద్యార్థులు విజయం సాధించడం పట్ల కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జె గణేష్ ప్రసాద్ రెడ్డి, డీన్ కె కృష్ణనాగు, డీన్ అడ్మిన్ డాక్టర్ కె ఈశ్వరరావు, హెచ్వోడిస్ సిఎస్‌సి డిపార్ట్మెంట్ డాక్టర్ కే.సుజాత, ఈఈఈ డాక్టర్ ఏఎస్ఎల్‌కే గోపాలమ్మ, ఈసిఈ డాక్టర్ పి పూర్ణప్రియ, సివిల్ వి.భార్గవి, సిఎస్‌డిఎం ఏ. వెంకటేశ్వరరావు, కళాశాల అధ్యాపక ఆధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.



ద్వితీయ స్థానం సాధించిన జట్టుతో యాజమాన్య ప్రతినిధులు

వెంకటేష్ అభిమానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అనకాపల్లి

విక్టరీ వెంకటేష్ పేరు మీద ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ వెంకటేష్ హెల్పింగ్ హ్యాండ్స్ బృందం ఆధ్వర్యంలో వడ్లపూడి ప్రాంతానికి చెందిన వెంకటేష్ అభిమాని గరికిపాటి రాజుకు మంగళవారం ఆర్థిక సహాయం అందజేశారు. ఇటీవల రాజు ఆటో ప్రమాదానికి గురై ముక్కుకి సర్జరీ చేయించుకోలేక శ్వాస సంబంధ వ్యాధితో బాధపడుతున్నారు. ఎపి వెంకటేష్ హెల్పింగ్ హ్యాండ్స్ బృందాన్ని సంప్రదించిన వెంటనే సర్జరీ నిమిత్తం గవరపాలెం పార్క్ సెంటర్లో వద్ద టీం సభ్యులు రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. సంస్థ వ్యవస్థాపకుడు పి.చందు ఆద్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అభిమానులు రోషన్, కొంగ నాగేశ్వరరావు, రాయి వెంకటరమణ, సోమేష్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పీవీ జగన్ మోహన్‌రావు, టియన్‌టియుసి నాయకుడు బుద్ధ భువనేశ్వర్ రావు, పెంటకోట సత్యనారాయణ, పరదేశినాయుడు పాల్గొన్నారు.

ఉపాధి హామీ వేతనం రూ.300 వచ్చేలా చూడాలి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

ఉపాధి హామీ కూలీలకు రోజు వేతనం రూ.300 వచ్చేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్మెంట్ కమీషనర్ కృష్ణ తేజ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఫీల్డ్ అసిస్టెంట్లు శిక్షణా కార్యక్రమం స్థానిక మండల పరిషత్తు కార్యాలయ సమావేశమందిరంలో మంగళవారం నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో జనవరి నుంచి జూన్ నెల వరకు చేపట్టవలసిన పనులు గురించి. చర్చించారు. రూ 300 రూపాయలు వేతనం ఉపాధి కూలీలకు అందేలా మార్కింగ్ ఇచ్చి ఏ విధమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అమృత్ సరోవర్ చెరువులు, ఫారం పాండ్స్, ఫిష్ పాండ్స్, కాలువల పూడికతీత, ట్రెంచ్ వర్క్స్, హార్టికల్చర్ తదితర పనులను గుర్తించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ విజయలక్ష్మి, ఏపిఓ వరాహలుబాబు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రధాని వర్చువల్ మీట్‌కు ఏర్పాట్లు



నక్కపల్లిలో వర్చువల్ మీట్‌కు ఏర్పాట్లు పరిశీలించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి-నక్కపల్లి

నక్కపల్లి మండలంలో బల్క్ డ్రగ్ పార్క్‌కు ఈనెల 8న విశాఖపట్నంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శంకుస్థాపన చేయనున్నారు. విశాఖ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న ప్రధాని,స్థానిక ప్రజలతో ముఖాముఖి నిర్వహించనున్నారు. ఈ మేరకు రాజయ్యపేట వద్ద వర్చువల్ ఏర్పాట్లును నర్సీపట్నం ఆర్‌డిఓ వివి రమణ పరిశీలించారు. వర్చువల్ మీట్‌కు హాజరయ్యే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

అచ్చుతాపురం : పూడిమడక సమీపంలో నిర్మించ తలపెట్టిన గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్‌కు బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విశాఖ నుండి వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో చురుగ్గా ఏర్పాట్లు చేశారు. ప్లాంట్ వద్ద స్థానికులు ప్రధానమంత్రి సందేశాన్ని, శంకుస్థాపన కార్యక్రమాన్ని తిలకించడానికి అనుకూలంగా భారీ స్థాయిలో వేదికను, భారీ ఎలక్ట్రానిక్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. ప్లాంట్ వద్దకు రహదారి ఏర్పాటు చేశారు. వేదిక ఏర్పాట్లును కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందం, రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, జిల్లా పరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ లాలం భవాని తదితరులు పరిశీలించారు. సంబంధిత అధికారులతో చర్చలు జరిపారు.



పూడిమడకలో ఏర్పాట్లు చేసిన దృశ్యం

10న ఆర్చరీ పోటీలకు ఎంపికలు

ప్రజాశక్తి-పరవాడ : ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల జూనియర్ ఆర్చరీ చాంపియన్ షిప్ రికర్వ్, కాంపౌండ్, ఇండియన్ రౌండ్ విభాగాలలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుండి పాల్గొనే క్రీడాకారుల ఎంపిక ఈ నెల 10వ తేదీన సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో జరుగుతుందని ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఆర్చరీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.నిశాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఫోటో, ఆధార్ కార్డు, జనన ధ్రువపత్రం తీసుకొని ఈ నెల 10వ తేదీ ఉదయం 9 గంటలకు సంస్కృతి గ్లోబల్ స్కూల్ ఆర్చరీ గ్రౌండ్‌కు రావాలని కోరారు.

ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలి



సబ్బవరంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

ప్రజాశక్తి-సబ్బవరం

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటనను విజయవంతం చేయడానికి కూటమి నాయకులు సమన్వయంతో పనిచేయాలని పెందుర్తి నియోజకవర్గం పరిశీలకులు, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. మండలంలోని ఇరువాడ దరి ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కూటమి నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ పెందుర్తి నియోజకవర్గం నుండి సుమారు 35 వేల మందిని తరలిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి గండి బాబ్జి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.మనోరమ, తహశీల్దారు బి.చిన్నికృష్ణ, ఎంపిడిఒ పి.పద్మజ, ఎమ్మెల్యే సోదరుడు పంచకర్ల వెంకటేశ్వరరావు టిడిపి కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్ర మోడీ పర్యటనను విజయవంతం చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.మనోరమ అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్తు సమావేశ మందిరంలో మంగళవారం అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. మండలానికి 150 బస్సులను కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

చోడవరం : విశాఖలో జరుగుతున్న ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఆంజనేయులు పాల్గొన్నారు.

అనకాపల్లి : ప్రధాని మోడీ బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో జన సమీకరణ చేపట్టాలని నియోజకవర్గం పరిశీలకులు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్విఎస్.వర్మ పిలుపునిచ్చారు. స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మోడీ బహిరంగ సభను విజయవంతం చేయవలసిన బాధ్యత కూటమి శ్రేణులపై ఉందని మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు అన్నారు. టిడిపి పార్లమెంట్ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

మోడీ పర్యటన విజయవంతంపై జివిఎంసి అనకాపల్లి జోనల్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి జోనల్ కమిషనర్ ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమం విజయవంతం చేసే దిశగా సచివాలయ సిబ్బంది కృషి చేయాలని కోరారు. సమావేశంలో మళ్ల సురేంద్ర, సంతోష్ కుమార్, సీఈఓ కొండమ్మ, పాల్గొన్నారు.

నక్కపల్లి : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విశాఖపట్నం పర్యటనను, మండలంలోని రాజయ్యపేట ప్రాంతంలో జరగనున్న వర్చువల్ మీట్ ను విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల ప్రత్యేక అధికారి పి ప్రసాద్, తహసీల్దార్ నరసింహమూర్తి, ఎంపిడిఒ డి.సీతారామరాజు ఆధ్వర్యంలో పలు శాఖల అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. మోడీ విశాఖ సభకు, వర్చువల్ మీట్‌కు జన సమీకరణ పై చర్చించారు.

మాడుగుల : ఈనెల 8న విశాఖలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభకు మాడుగుల మండలం నుండి 25 బస్సులు బయలుదేరుతాయని ఎంపిడిఓ కొంకి అప్పారావు తెలిపారు. ఇప్పటికే జన సమీకరణపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ప్రధాని సభకు వెళ్లిన వారిని తిరిగి వారి గమ్యస్థానం చేరేంతవరకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేశామన్నారు.

భీమునిపట్నం : విశాఖలో బుధవారం నిర్వహించే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పర్యటన, రోడ్‌షోను విజయవంతం చేయాలని కూటమి శ్రేణులను కార్యక్రమ పరిశీలకులు జివి.ఆంజనేయులు కోరారు. ప్రధాన మంత్రి సభను విజయవంతం చేయాలని కోరుతూ స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం నియోజక వర్గ స్థాయి కూటమి నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకులు కోట్ని బాలాజీ, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు

సీతమ్మధార : ప్రధాని మోడీ విశాఖ పర్యటన విజయవంతం చేయాలని మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యాన జనసేన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలు, ఉత్తరాంధ్ర జిల్లాల కో-ఆర్డినేటర్లు, జివిఎంసి మహిళా కార్పొరేటర్లు, మహిళలు పాల్గొన్నారు.

పాడి రైతులకు బోనస్‌ల పంపిణీ

ప్రజాశక్తి-సబ్బవరం : సంక్రాంతి పండుగ సందర్భంగా విశాఖ డెయిరీ పాల ఉత్పత్తిదారులకు అందిస్తున్న బోనస్‌లను సబ్బవరం యూనిట్ పరిధిలో మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విశాఖ డెయిరీ డైరెక్టర్ శరగడం శంకర్రావు మాట్లాడుతూ డెయిరీ ఛైర్మన్ ఆనంద్ కుమార్ ఇచ్చిన మాట ప్రకారం ఈ సంవత్సరం రెండు పేమెంట్లు ఇచ్చుటకు తగిన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. పాడిని నమ్ముకొని జీవించే ప్రతి రైతుకు విశాఖ డెయిరీ వల్లే న్యాయం జరుగుతుందని చెప్పారు. సబ్బవరం మండల యూనిట్ పరిధిలోని 104 కేంద్రాలకు రూ.4,68,24,664 విడుదల చేశామన్నారు. కార్యక్రమములో యూనిట్ ఆఫీసర్ ఎఆర్.ప్రభాకర్, యూనిట్ పరిధిలోని సిబ్బంది, పాల సొసైటీల అధ్యక్షులు, వేతన కార్యదర్శులు, పాడిరైతులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు ఫ్యాన్లు వితరణ

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలకు దేవరాపల్లి అంబేద్కర్ గురుకులం పూర్వ విద్యార్థులు 10 సీలింగ్ ఫ్యాన్లను సమకూర్చారు. వాటిని మంగళవారం ప్రిన్సిపాల్ ఎన్.రామక్రిష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకొని ఉన్నత స్థానాల్లో ఉండాలని సూచించారు. అనంతరం ప్రిన్సిపాల్ రామకష్ణ పూర్వ విద్యార్థులు ఆర్.త్రినాథ్, ఎన్ శ్రీను, సిహెచ్ నాయుడు, అనిల్, కోటేశ్వరరావులను, దీనికి కృషి చేసిన ఉపాధ్యాయుడు టి.రాంబాబును అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిరంజీవి, ప్రభాకరరావు, రఘురామనాయుడు, సాయిరాం , మోహన్‌రావు, సింహాచలం, నాయుడు పాల్గొన్నారు.

ముగిసిన ఆరాధన మహోత్సవం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని కొత్తపెంట గ్రామంలో సద్గురు దేవానంద సరస్వతి స్వామీజీ ఆధ్వర్యాన ఆదివారం నుండి నిర్వహిస్తున్న ఆరాధన మహోత్సవం మంగళవారం ముగిసింది. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పివిజి కుమార్, టిడిపి మండల అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, మాజీ ఎంపిపి కనపర్తి భాస్కరరావు, టిడిపి నాయకులు చల్ల నానాజీ, సర్పంచ్ నీలిమ వెంకటరావు, రెడ్డి పైడిమనాయుడు ప్రగాఢ నరసింహమూర్తి, పి.ముత్యాలరావు, రొంగలి శంకర్రావు పాల్గొన్నారు.

104 వైద్య సేవలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-మునగపాక : ప్రతి ఒక్కరూ 104 వైద్య సేవలను వినియోగించుకోవాలని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో మంగళవారం జరిగిన 104 వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్యాధికారిని విమలగిరి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌వి లక్ష్మి, ఎం ఎల్ హెచ్ పి సంతోషి ,ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

శత శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : పదవ తరగతి పరీక్షల్లో శతశాతం ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాశాఖ అధికారి బి.కాశీ విశ్వేశ్వరరావు అన్నారు. మండలంలోని తురకలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. పదవ తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించడంపై ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు వై రాజేంద్రప్రసాద్, నోబుల్ టీచర్ అసోసియేషన్ అధ్యక్షులు టివి రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎంఇఒను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

విశాఖ ఉక్కుపై చంద్రబాబుది మోసపూరిత వైఖరి

ప్రజాశక్తి-అనకాపల్లి

నోటితో నవ్వి, నొసటితో వెక్కిరించారన్న సామెత.., విశాఖ స్టీల్‌ప్లాంట్ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వైఖరికి సరిగ్గా సరిపోతుందని వైసిపి జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. 32 మంది ప్రాణ త్యాగాలతో, దశాబ్దాల పోరాటాల చరిత్ర కలిగిన వైజాగ్ స్టీల్‌ను ప్రైవేటుపరం చేసేందుకు మోడీ ప్రభుత్వం నాలుగేళ్లగా చేయని ప్రయత్నం లేదన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటుపరం కాకుండా చూస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన చంద్రబాబు, ఢిల్లీలో ప్రధాని మోడీతో సమావేశమైన సందర్భంలో అనకాపల్లి జిల్లాలో నెలకొల్పిదలిచిన ఆర్సెల్లార్ మిట్టల్ ప్రైవేటు స్టీల్‌ప్లాంట్‌కు ముడి ఇనుప ఖనిజం కేటాయించాలని కోరారు తప్పా, విశాఖ స్టీల్‌ప్లాంట్ గురించి ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని కార్మికులు ఏళ్ల తరబడి పోరాడుతుంటే దాని గురించి ప్రస్తావించకుండా, ఇప్పటి వరకు భూమి కూడా కేటాయించని మిట్టల్ ప్లాంట్‌కు ఇనుప ఖనిజం కేటాయించాలని కోరడంలో విశాఖ ఉక్కు పట్ల కూటమి వైఖరి ఏమిటో అర్థమవుతుందని పేర్కొన్నారు. వైజాగ్ స్టీల్‌ను రక్షిస్తామని ఎన్నికల్లో టిడిపి, జనసేన హామీ ఇచ్చి ఇప్పుడు మోసం చేస్తున్నాయని ఆరోపించారు. టిడిపి, జనసేన నేతలకు చిత్తశుద్ధి ఉంటే మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి చేసి ప్రైవేటీకరణ సహా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని నిర్వీర్యం చేసే అన్ని చర్యలనూ అడ్డుకోవాలని, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు కట్టుబడాలని డిమాండ్ చేశారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : రైతులు తమ భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని మండల తహశీల్దార్ ఎం లక్ష్మీ అన్నారు. మంగళవారం మండలంలోని తురకలపూడిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రైతుల నుండి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండల కేంద్రం సబ్బవరం గ్రామంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై 3 అర్జీలు అందినట్లు స్థానిక ఆర్ఐ వీరయ్య తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఎంపిటిసి బైలపూడి దేముడుబాబు, ఎర్రంశెట్టి రాము, వెలుగు సర్వేయర్ రాంబాబు, వీఆర్వోలు వినోద్, అనంత్, నూకరత్నం, సౌజన్య, విలేజ్ సర్వేయర్లు లోకేష్, రామర్జున్, హేమంత్, ఇంద్ర, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-యలమంచిలి

యువత సత్ప్రవర్తన అలవర్చుకోవాలని, చెడు అలవాట్లు దరిచేరకుండా చూసుకోవాలని భాగవతుల చారిటబుల్ ట్రస్టు కార్యదర్శి భాగవతుల శ్రీరామ్మూర్తి అన్నారు. మున్సిపాలిటీ 25వ వార్డు పరిధి కొత్తపాలెంలో ధనుర్మాసం సందర్భంగా జరుగుతున్న పూజలు, వేకువ నగర సంకీర్తనలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. సంకీర్తనలో పాల్గొన్న భక్తులందరికీ మెడల్లో స్కార్ఫ్లు, కాషాయ తువ్వాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ ఛైర్మన్ ఆడారి భాస్కర్, సెక్రటరీ పిల్లా శ్రీనివాస్, గ్రామపెద్దలు ఏవి రెడ్డి నాయుడు, సత్యారావు, బి.సంతోష్, ఎ.జగన్నాధరావు, ఎస్‌వి రమణ (బిసిటి), భక్తులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అధికారులు

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-కశింకోట : ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఎడిఎ ఎం.రామారావు అన్నారు. కసింకోట మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని జబ్బవరెడ్డి తుని, నరసింగబిల్లి గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రైతులతో కలిసి పొలాల్లోకి వెళ్లి వరి, చెరుకు పంటలను పరిశీలించారు. ఆధునిక వ్యవసాయ పనిముట్లను ఉపయోగించుకుంటే పెట్టుబడి తగ్గి ఆదాయం పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఎం.స్వప్న, విఏఏ పుష్ప, కే.రామకృష్ణ, జి.కృష్ణ, రాయుడు రమేష్ రైతులు పాల్గొన్నారు.

వికలాంగుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి-పరవాడ : వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేస్తుందని సమగ్ర శిక్ష జిల్లా ఏపిసి జయ ప్రకాష్ అన్నారు. పరవాడ భవిత కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. భవిత కేంద్రంలో జరుగుతున్న కార్యక్రమాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సమగ్ర శిక్ష ద్వారా అన్ని రకాల సేవలు, సదుపాయాలు కల్పించడంతోపాటు అలవెన్స్, ఉపకరణాలు అందిస్తున్నట్లు చెప్పారు. వికలాంగులకు అవసరమైన స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ కల్పిస్తూ వారి శారీరక, మానసిక అభ్యున్నతకు తోడ్పడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి.శకుంతల, ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, ఫిజియోథెరపిస్ట్ కిరణ్, వెంకటలక్ష్మి, భవిత ఉపాధ్యాయురాలు టి.కుమారి పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సు వాయిదా వేయండి

- మొక్కుబడి నిర్వహణపై రైతుల పెదవి విరుపు
- కిందిస్థాయి ఉద్యోగులతో కానిచ్చేయడంపై ఆగ్రహం

ప్రజాశక్తి- రోలుగుంట : కిందిస్థాయి ఉద్యోగులతో రెవెన్యూ సదస్సు నిర్వహించడం వల్ల ప్రయోజనం లేదని, సమస్యలు వినడం, దరఖాస్తుల స్వీకరణ తప్ప ఎటువంటి చర్యలు ఉండడం లేదనిరొంగలపాలెం జానకిరాంపురం చెట్టుపల్లి గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం జెపి అగ్రహారంలో రెవెన్యూ సదస్సును రెవెన్యూ ఇన్స్పెక్టర్ రామ్మూర్తి, మండల సర్వే తమతయ్య, విఆర్ఒ రాములతో నిర్వహించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు కిందిస్థాయి ఉద్యోగులతో నిర్వహించే జేపీ అగ్రహారం రెవెన్యూ సదస్సు వాయిదా వేయాలని, మరోమారు మండల, డివిజన్ స్థాయి అధికారులతో పూర్తిస్థాయిలో నిర్వహించాలని వేడుకున్నారు .ఈ మేరకు ఎంఆర్ఐ రామ్మూర్తికి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సుకు హాజరైన సర్పంచ్ చిటికెల వెంకటరమణ, మాజీ సర్పంచ్ దొంగల రమణ, దుంగల శంకర్ దుంగల బుచ్చిరాజు, ఇతర గ్రామపెద్దలు మాట్లాడుతూ జెపి అగ్రహారం రెవెన్యూ లో జెపి అగ్రహారం రొంగలపాలెం, నర్సీపట్నం మండలం చెట్టిపల్లి గ్రామానికి చెందిన సుమారు 400మంది రైతులు 450 ఎకరాలు భూమిని తాతతండ్రుల నుంచి సాగు



ఆర్ఐ రామ్మూర్తికి వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్, గ్రామపెద్దలు

చేస్తున్నామని అన్నారు. ఈ భూములకు సంబంధించి పాస్ పుస్తకాలు పంపిణీ చేయలేదన్నారు. దీనిపై కొన్నేళ్ళ గారెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్న తమకు న్యాయం చేయలేదు. రెవిన్యూ సదస్సుల్లో తమకు న్యాయం జరుగుతుందని ఎంతో ఆశతో వచ్చామని, కానీ సదస్సులో కింది స్థాయి అధికారుల హాజరుతో వినతిపత్రం సమర్పణ తప్ప తమ సమస్య పరిష్కారమయ్యే పరిస్థితి కనిపించడం లేదన్నారు. సదస్సును వాయిదా వేసి, డివిజన్ స్థాయి అధికారులు, తహశీల్దార్; డిప్యూటీ తహశీల్దార్లతో మరోమారు నిర్వహించి, తమ సమస్యను పరిశీలించి, పరిష్కరించాలని కోరారు. ఎంఆర్ఐ రామ్మూర్తి కు వినతిపత్రం అందజేశారు.

రెవెన్యూ నిర్వాకంతోనే రీసర్వే తప్పిదాలు

కోటవురట్ల :రెవెన్యూ నిర్వాకం వల్లే రీసర్వేలో అనేక తప్పిదాలు దొర్లి రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఇపుడు వాటిని పరిష్కరించేందుకు నిర్వహించే రెవెన్యూ సదస్సులను సైతం మొక్కుబడి తంతుగా మార్చేశారనిమాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణరాజు మండిపడ్డారు. మంగళవారం మండల కేంద్రంలోఆర్ఐ వర్ధవరావు ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకమంటూ చేపడుతున్న రెవెన్యూ సదస్సుకు తాహసిల్దారు, లేదా డిప్యూటీ తాహసిల్దారు లేకుండా రెవెన్యూ సదస్సు ఎలా నిర్వహిస్తారు వాయిదా వేయాల్సింది కదా అన్నారు, గతంలో రెవెన్యూ నిర్వాకం కారణంగా రికార్డులన్నీ తారుమారయ్యాయన్నారుఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో 25 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు, మండల సర్వేయర్ శ్రీనివాస్, విఆర్ఒ రమేష్, విఆర్ఒ అప్పారావు, ఎంపిటిసి సూర్యారావు పాల్గొన్నారు.

యథేచ్ఛగా తాగునీరు వృథా

వారం రోజులైనా పట్టించుకోని పంచాయతీ, అధికారులు

ప్రజాశక్తి -మాడుగుల : పంచాయతీ పాలకవర్గం నిర్లక్ష్యం కారణంగా తాగునీరు వథాగా పోతున్నా పట్టించుకునే పరిస్థితి లేదనే విమర్శలు వున్నాయి. మాడుగుల కేంద్రంలో జాగాని వీధి ఓం శాంతి నిలయం వద్ద పైప్ లైన్కు రంధ్రం ఏర్పడడంతో ప్రజలకు అందాల్సిన తాగు నీరు వథాగా పోతుంది. వారం రోజులుగా పైపులైన్ నుంచి తాగునీరు లీక్ అవుతూ పోతున్నా సంబంధిత పంచాయతీ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథాగా పోవడంతోపాటు పరిసర ప్రాంతాలు బురదమయం అవుతున్నాయనిజాగాని వీధికి చెందిన మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని, తాగునీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.



వారం రోజులుగా ఫౌంటేయిన్లా విరజిమ్ముతున్న పైపులైన్లోని నీరు

గుండుపాలలో పశువైద్య శిబిరం

ప్రజాశక్తి -గొలుగొండ : పశు సంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థల సహకారంతో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా గొలుగొండ మండలం గుండుపాలలోఉచిత గర్భకోశ చికిత్స శిబిరం, పాడిరైతుల అవగాహనా సదస్సు నిర్వహించారు. టిడిపి ప్రతినిధి చిన్నా రావు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలన్నారు. నర్సీపట్నం ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డా. రాంబాబు మాట్లాడుతూ పాడిరైతులు పాల ఉత్పత్తి పెరగడానికి క్రమం తప్పకుండా పశువైద్యుల సలహా ప్రకారం మందులు వాడాలని సూచించారు.

పశుగ్రాసం పెంచుకునేవారు ఉపాధి హామీ పథకం కింద పెంచుకుంటే పెంపకం ఖర్చులు ప్రభుత్వం రైతు ఖాతాలో జమ వేస్తుందని దానికోసం జాబ్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్ కాపీ, గ్రామసభ తీర్మానంతో జతచేసి తమకు దగ్గరలో ఉన్న రైతు సేవా కేంద్రంలో పశువైద్య సహాయకులు సంప్రదించమని తెలిపారు. కార్యక్రమంలో 37 పశు వులకు గర్భకోశ వ్యాధుల చికిత్స ,130 గొర్రెలు, మేకలకు డీవార్మింగ్, 200 కోళ్లకు మందులు అందజేశారు. చెట్టుపల్లి పశు వైద్యశాల డాక్టర్ పుష్ప, పాములవాక పశువైద్యశాల డాక్టర్ హరిప్రియ, కేడీపేట పశు వైద్యశాల డాక్టర్ శిరీష, గొలుగొండ మండల పశుసంహాయక సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న సురేష్

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని కృష్ణదేవిపేట హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థులకు అల్లాడ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అల్లాడ సురేష్ మంగళవారం స్టడీ మెటీరియల్ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ట్రస్ట్ ప్రారంభించినప్పటి నుండి పేద విద్యార్థులకు అభ్యసన సామగ్రి ఏటా అందజేస్తున్నామన్నారు.కార్యక్రమంలో విశాఖ రూరల్ జిల్లా జనసేన ఉపాధ్యక్షులు చక్రవర్తి, ఉప సర్పంచ్ దుంపలపూడి సహదేవుడు, ఈర్లే చిన్ని, పాతాళ శివ, అనిశెట్టి గోపి, గుడివాడ శివాజీ, ఎర్ర ప్రసాద్, బాలం అరుణ్ పాల్గొన్నారు.

లేగ దూడల ప్రదర్శనకు స్పందన

ప్రజాశక్తి -రోలుగుంట : మండలంలోని బుచ్చంపేట గ్రామంలో మంగళవారం రాష్ట్రీయ గోకులమిషన్ ఆధ్వర్యంలో లేగా దూడల ప్రదర్శన నిర్వహించారు. స్థానిక సర్పంచ్ ఉలబాల రాము ప్రారంభించిన ప్రదర్శనలో బుచ్చంపేట రత్నంపేట, వడ్డిప, ఎంకే పట్నం, గుర్రంపేట గ్రామాల రైతులు 45 లేగ దూడలను ప్రదర్శనలో ఉంచారు. ప్రదర్శన పాల్గొన్న ఆరోగ్యవంతమైన లేగదూడలకు బహుమతులు అందజేశారు. పి వెంకటస్వామి, బూరెడ్ల చిన్నోడు, రెడ్డి రాజుబాబులకు చెందిన లేగదూడలకు వరుసగా మొదటి, రెండు, మూడవ బహుమతులు వెటర్నరీ ఏడి టి పుష్ప అందజేశారు. స్థానిక పశువైద్యాధికారి బాల మౌనిక, కార్యక్రమంలో వీఎస్ఏడీఎల్డిఎ డాక్టర్ సౌజన్య, కొత్తకోట పశువైద్యాధికారి డాక్టర్ బాలతేజ పశువైద్య సిబ్బంది, పాడిరైతులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - మాడుగుల : మాడుగుల నుండి కేజేపురం వెళ్లే దారి మధ్యలో పచ్చని పొలాల మధ్య వెలసిన స్వయంభూ ఉమా పార్వతీ భీమ లింగేశ్వర స్వామి ఆలయం పురాతన దేవాలయాలలో ఒకటిగా ఎంతో ప్రసిద్ధిగాంచింది. ఆలయానికి వచ్చే భక్తులు రోడ్డు లేక నానా అవస్థలు పడేవారు.

భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణం చుట్టూ స్థానిక ఎంపిటిసి కుక్కర మహేశ్వరి నిధులు 5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకుపనులు మంగళవారం గ్రామ సర్పంచ్ ఎడ్ల కళావతి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, ఎడ్ల హేమంత్ కుమార్, కుక్కర్ శ్రీధర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

గురుకులంలో సంక్రాంతి సంబరాలు



భోగిమంట వేస్తున్న ప్రిన్సిపల్,ఉపాధ్యాయులు, విద్యార్థులు

ప్రజాశక్తి -నక్కపల్లి : నక్కపల్లి గురుకులంలో ప్రిన్సిపల్ సువర్ణ కుమారి ఆధ్వర్యంలో మంగళవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల ఆటపాటలు, ముగ్గుల పోటీలతో సంక్రాంతి శోభ ఉట్టిపడే విధంగా వేడుక జరుపుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి భోగి మంట వేశారు. ముగ్గులు, ఆటపాటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

కొక్కెర తెగులు నివారణకు చర్యలు

ప్రజాశక్తి- కోటవురట్ల : గ్రామీణ ప్రాంతాల్లో పెంచుకునే నాటు కోళ్లకు సోకుతున్న కొక్కెర తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు పశుసంవర్ధక సహాయ సంచాలకులు డాక్టర్ నరేష్ తెలిపారు, ఇటీవల వివిధ ప్రాంతాల్లో కోళ్లకు తెగులు సోకి చనిపోతున్నాయని పెంపకందారులు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో పశువైద్యసిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండి ఈనెల 31 వరకు సేవలు అందిస్తారని, అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

హంస వాహనంపై వెంకన్న తిరువీధి సేవ

ప్రజాశక్తి -నక్కపల్లి : ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయ అర్చకులు ప్రసాదాచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, గోపాలాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవమూర్తులను హంస వాహనంపైన, గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తులను పల్లకిలోను వేంచేపుచేసి గ్రామ తిరువీధి సేవ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి దర్శించుకున్నారు. గోదాదేవి సన్నిధిలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు,భక్తులు పాల్గొన్నారు.

రబీలో అపరాల సాగుపై అవగాహన

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని ఏటిగైరంపేట గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి కెసుధారాణి పాల్గొని, రబీలో అపరాలు పంట, కూరగాయల పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో బి.రామకృష్ణ, ఏటిగైరంపేట సర్పంచ్ నల్లబెల్లి స్వామి, విహెచ్ఎ శెట్టి ఈశ్వరి, దేవి రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయ అనుబంధ పనులకు ప్రాధాన్యత

- ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లకు వర్చువల్ శిక్షణలో రాష్ట్ర కమిషనర్ కృష్ణతేజ

ప్రజాశక్తి - రావికమతం :ఉపాధి హామీ పథకం అమలులో వ్యవసాయ అనుబంధ పనులకు ప్రాధాన్యతనివ్వాలని రాష్ట్ర ఉపాధి హామీ కమిషనర్ కృష్ణతేజ ఆదేశించారు. . మంగళవారం రాష్ట్ర కేంద్రం నుంచి.ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్స్కు ఒక్కరోజు వర్చువల్ శిక్షణా తరగతులను నిర్వహించారు. స్థానికమండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ వెంకన్నబాబు ఆధ్వర్యంలో శిక్షణలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జనవరి ఒకటి నుండి జూన్ నెలాఖరు వరకు వ్యవసాయానికి ఉపయోగకరమైన ఫిష్ పాండ్, అమత్ సరోవర్, ఫీల్డ్ చానల్స్, ఫీడర్ చానెల్స్, కెనాల్లైన్ ప్లాంటేషన్, మొదలగు పనులను అలాగే, వ్యక్తిగత గోకులాలు, ఫారం పాండు, రింగు ట్రెంచెస్,బౌండరీ ట్రెంచెస్, బెంచ్ టెర్రేసింగ్ మొదలగు పనులకు ప్రాధాన్యత కల్పిస్తూ పనిచేయాలన్నారు ఇప్పటికే పూర్తయిన మినీ గురుకులాల ప్రారంభోత్సవాలను .ఈనెల 10, 11, 12 తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టాలని సూచించారు. ఆరు నెలలకు సంబంధించినటువంటి పనుల జాబితాను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పథకం నిబంధనల మేరకు వ్యవసాయ అనుబంధ పనుల వ్యయం ఒక ఆర్థిక సంవత్సరంలో అయ్యే మొత్తం ఖర్చులో 60 శాతం మాత్రమే ఉండేలా చూసుకోవాలన్నారు. అర్హత కలిగిన జాబ్ కార్డు లేనటువంటి వారందరికీ జాబు కార్డు కల్పించాలని, జాబు కార్డు కలిగిన వారందరికీ ఉపాధి పని కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామానికి, గ్రామానికి పొలాలకు, గ్రామాలలోనూ మట్టి రోడ్ల నిర్మాణం, చెరువుల పూడికతీత, గడ్డి పెంపకం, కంపోస్ట్ పిట్టలు, ఇంకుడు గుంతలు, చెత్తతో సంపద తయారీ కేంద్రాలు,, సీసీ డ్రైన్లు, సిసి రోడ్లు, కల్వర్టులు, చెక్



శిక్షణలో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్లు, అధికారులు

డాములు, రోడ్డు ఇరువైపులా మొక్కలు పెంపకం, జీడి మామిడి తోటల పెంపకం, చెరువు గట్ల పైన, ప్రభుత్వ బంజరు స్థలాలలో కొబ్బరి తదితర మొక్కలను నాటడం మొదలగు పనులన్నీ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టవచ్చునన్నారు.కార్యక్రమంలో ఉపాధి హామీ రాష్ట్ర డైరెక్టర్ షణ్ముఖ, అడిషనల్ కమిషనర్ శివప్రసాద్ ,జాయింట్ కమిషనర్ సునీత, ఎపిఒ కాశి, టెక్నికల్ అసిస్టెంట్స్ కొండాజీ రమణ ,బైరాగి, పాల్గొన్నారు.

ప్రజల పత్రిక 'ప్రజాశక్తి'

నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరణలో ఎంపిడిఒ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపిడిఒ, తదితరులు

ప్రజాశక్తి - రావికమతం :. వాస్తవాలను ఉన్నది ఉన్నట్టుగా నిర్భయంగా ప్రచురించే పత్రిక ప్రజాశక్తి అని ఎంపిడిఒ వెంకన్నబాబు అన్నారు.మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రజాశక్తి 2025 క్యాలెండరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యం ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న పత్రిక ప్రజాశక్తి అని యాడారు. జర్నలిస్టుగా పనిచేయడం అనేది కత్తి మీద స్వాము లాంటిదని, అటువంటి వృత్తిలో ఉంటూ, ప్రభుత్వానికి, ప్రజలకు, అధికారులకు మధ్య వారిదిగా పనిచేస్తున్న జర్నలిస్టులు అభినందనీయులన్నారు. ప్రస్తుతం సోషల్ మీడియా, యూట్యూబ్,ఎలక్ట్రానిక్ మీడియా, తదితర ప్రసార సాధనాలు ఎన్నో వచ్చినప్పటికీ ప్రజాశక్తి పత్రికకు ఆదరణ తగ్గలేదన్నారు. అప్పుడు, ఇప్పుడు ఎప్పుడూ ,ఒకే క్వాలిటీ, ఒకే విధానం, నైతిక విలువలకు కట్టుబడి నడుస్తున్న పత్రిక ప్రజాశక్తి అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఒ, సీనియర్ అసిస్టెంట్ , జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్ పలు గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు చోడవరం నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు , మేడివాడ పంచాయతీ తెలుగుదేశం పార్టీ నాయకులు శివ మండల సిబ్బంది పాల్గొన్నారు.

సిపిఎం నేతల గృహ నిర్బంధం అమానుషం



నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : మండలంలో అడ్డురోడ్డులో సమీపంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజు గృహ నిర్భంధం చెయ్యడాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.సత్యనారాయణ మాట్లాడుతూ నిర్వాసితులకు న్యాయం చెయ్యాలని, ప్రమాదకరమైన బల్క్ డ్రగ్స్ కంపెనీని రాజయ్యపేట తీర ప్రాంతంలో పెట్టవద్దని మత్యాకారులకు, ఈ ప్రాంత ప్రజలకు అండగా పోరాడుతున్న సిపిఎం నాయకులను నిర్భంధం చెయ్యడం చట్ట విరుద్ధం అన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను కూటమి ప్రభుత్వం చేస్తోందని, ప్రజల గొంతు నొక్కాలని చూడడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు.
గృహ నిర్భంధాలు, అక్రమ అరెస్టులతో పోరాటలను ఆపలేరని హెచ్చరించారు. అప్పలరాజును బేషరతుగా విడిచిపెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బత్తుల ప్రసాద్, నాగేశ్వరావు, రమణ, కరణం రాంబాబు పాల్గొన్నారు

ముమ్మరంగా పింఛన్ల తనిఖీ

ప్రజాశక్తి -కోటవురట్ల : మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో పింఛనుదారుల తనిఖీలు నిర్వహించారు, వికలాంగ పింఛన్ల లబ్ధిపొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తూ, పరిశీలనలు చేస్తున్నారు. వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యులు బృందంగా వెళ్లి వికలాంగ పింఛనుదారుల స్థితిగతులపై పరిశీలన చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో 18 మంది వికలాంగ పింఛన్లు అందుకుంటున్నారని వారిని పరిశీలించామన్నారు. అంతా అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

ఊరూరా నిరసనల వెల్లువ

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ తగదని, బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటు చేయొద్దని ఆందోళనలు



ఆరిలోవలో మాట్లాడుతున్న ఆర్‌కెఎస్‌వి .కుమార్

ప్రధాని మోడీ పర్యటనలో భాగంగా నక్కపల్లి మండలంలో బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటుకు శంకుస్థాపన చేయడాన్ని నిరసిస్తూ, అలాగే విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పలుచోట్ల సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.

ప్రజాశక్తి- ఆరిలోవ : విశాఖలో జరిగే సభలో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని నిలిపివేస్తున్నామని, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తున్నామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్ చేశారు. జివిఎంసి పదో వార్డు పరిధి ఆరిలోవ బిఎన్ఆర్.నగర్‌లో సిపిఎం ఆధ్వర్యాన మంగళవారం నిరసన తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, సొంత గనులు కేటాయించాలని, పూర్తి సామర్థ్యంతో నడపాలని, కార్మికులకు బకాయి జీతాలు చెల్లించాలని నినదించారు. సిపిఎం నాయకులు వి.నరేంద్రకుమార్, డి.నాగరాజు, ఎ.రమణ, జి.నాగరాజు, మణి, సన్యాసమ్మ, అన్నపూర్ణ, నారాయణరావు, మౌళి, సూరిబాబు పాల్గొన్నారు.

గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయబోమని ప్రకటించాలని భెల్ ప్రోగ్రెసివ్ ఫ్రంట్ నాయకులు జిటిపి.ప్రకాష్, సీతన్నాయుడు డిమాండ్‌చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో ఉన్న అన్ని కార్మిక సంఘాలు పోరాట కమిటీగా ఏర్పడి చేస్తున్న పోరాటానికి మద్దతుగా దేశవ్యాప్తంగా వివిధ రూపాల్లో ఆందోళనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రకటన విడుదల చేసిన వారిలో ఎస్.జగన్నాధరావు, వి.ఆనందరావు, కె.విజయకుమార్, మురళీశ్వరరావు, కె.నారపరెడ్డి, అల్లు అప్పారావు ఉన్నారు.

పెదగంట్యాడలో పోతిన సన్యాసిరావు భవన్ నుంచి పెదగంట్యాడ కూడలి వరకు సిపిఐ ఆధ్వర్యాన నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కసిరెడ్డి సత్యనారాయణ, కె.అచ్యుతరావు, జి.ఆనంద్, కె.వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి : స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని రద్దు చేస్తున్నట్లు, సొంతగనులు కేటాయిస్తున్నట్లు, ప్లాంట్‌ను పూర్తిస్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో నడిపించేందుకు అన్నివనరులు కేటాయిస్తున్నట్లు విశాఖలో ప్రధాని నరేంద్రమోడీ స్పష్టంగా ప్రకటించాలని సిఐటియు పెందుర్తి జోన్ కార్యదర్శి జి.శంకర్రావు డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యాన ముఠా కార్మికులు మంగళవారం చిన్న పరిశ్రమలు వద్ద బ్లాక్ బ్యాడ్జీలు పెట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ప్రకారం విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే నడిచేవిధంగా కేంద్ర ప్రభుత్వాన్ని కూటమి నేతలు ఒప్పించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.అప్పలనాయుడు, మరిడియ్య, రమణ, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ముఠా కార్మికులు పూర్ణా మార్కెట్ స్ప్రింగ్ రోడ్డు వద్ద నిరసన తెలిపారు. వారినుద్దేశించి ముఠా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బారావు మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.చంద్ర శేఖర్, పైడిరాజు పాల్గొన్నారు. అలాగే సింగ్ రోడ్ జంక్షన్ వద్ద సిమ్మ నాయుడు ఆధ్వర్యాన భవన నిర్మాణ కార్మికులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా నాయకులు కె.నర్సింగరావు, సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి, శ్రీను, నాయుడు, శేఖర్ పాల్గొన్నారు.



పూర్ణామార్కెట్ వద్ద ఆందోళన చేస్తున్న ముఠా కార్మికులు

బల్క్‌డ్రగ్ పార్కును రద్దు చేయాలి : కాంగ్రెస్

సీతమ్మధార : నక్కపల్లిలోని బల్క్ డ్రగ్ పార్క్‌ను రద్దు చేయాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని, సొంతగనుల కేటాయించాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామారావు డిమాండ్‌చేశారు. ప్రజలు వ్యతిరేకిస్తున్న బల్క్ డ్రగ్ పార్క్‌కు శంకుస్థాపన చేయడం సహేతుకం కాదని పేర్కొన్నారు. ఇప్పటికే తీరప్రాంతంలో కాలుష్య కారక పరిశ్రమలతో మత్స్యకారులు, ప్రజల బతుకులు చిన్నాభిన్నమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల జీవితాన్ని విధ్వంసం చేసే బల్క్ డ్రగ్ పార్క్ శంకుస్థాపనను విరమించుకోకపోతే భవిష్యత్తులో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించి సెయిల్‌లో విలీనం చేసి పరిరక్షించాలని డిమాండ్ చేశారు.



అనకాపల్లిలో సిపిఎం నిరసన

అనకాపల్లి :ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ వస్తున్న సందర్భంగా విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ నిర్ణయం విరమించుకుంటూ ప్రకటన చేయాలని, నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కు వెనక్కి తీసుకోవాలని కోరుతూ మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో అనకాపల్లి బైపాస్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్ సమస్య పరిష్కరించకుండా ఆర్సిలాల్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌పై దాసోహమవటం సిగ్గుచేటన్నారు. వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో సేకరించిన భూములకు పరిహారం, ప్యాకేజీ పూర్తిస్థాయిలో ఇవ్వకుండా భారీగా పోలీసులను మోహరించి బల్క్ డ్రగ్ పార్కు కోసం భూముల్లో ఉన్న చెట్లను తొలగించడం అన్యాయమన్నారు. ప్రపంచ దేశాలు, కాకినాడ జిల్లా ప్రజలు తిరస్కరించిన బల్క్ డ్రగ్స్ పార్కును నక్కపల్లిలో ఏర్పాటు చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శంకరరావు, జిల్లా కమిటీ సభ్యులు వివి.శ్రీనివాసరావు, అల్లు రాజు, బి.ఉమామహేశ్వరరావు, నాయకులు కె.ఈశ్వరరావు, నాగిరెడ్డి సత్యన్నారాయణ, ఎం.రమణ, పి.చలపతి, జి.సుభాషిణి, బి.రాము తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : సిపిఎం అచ్చుతాపురం మండల కమిటీ ఆధ్వర్యాన స్థానిక జంక్షన్‌లో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ ఆర్.రాము మాట్లాడుతూ పూడిమడకలో ఏర్పాటు చేయనున్న ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ హబ్‌లో స్థానికులకు, నిర్వాసిత కుటుంబాలకు విద్యార్హతలను బట్టి 75శాతం శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.సోమునాయుడు, రవి, జగదీష్, వెంకట్, కుమార్, అప్పలరాజు పాల్గొన్నారు.

పరవాడ : సిపిఎం ఆధ్వర్యంలో పరవాడ సినిమా హాల్ జంక్షన్ వద్ద మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు వివి రమణ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌పై మోడీ స్పష్టమైన ప్రకటన చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొప్పాక దేవుడు, జి.అప్పారావు, కే.నాయుడు, బి.లచ్చిబాబు, జి శ్రీను, కార్మికులు పాల్గొన్నారు.

చోడవరం : మండలంలోని వెంకన్నపాలెంలో జంక్షన్లో సిపిఎం ఆధ్వర్యాన రాస్తారోకో నిర్వహించారు. దేవరపల్లి మండలం చింతలపూడిలో హైడ్రో ప్రవర్ ప్రాజెక్టు వలన గిరిజనులు జీవితాలు అతలాకుతలం అవుతాయని, దానిని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ఎస్వి నాయుడు, పి.సాంబశివరావు, బి.దేవుళ్ళు, జోగా రాము, సత్తిబాబు, నాగరాజు, లక్ష్మణ్, రాజు పాల్గొన్నారు.

కె.కోటపాడు : ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన నేపథ్యంలో దేవరాపల్లిలో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిలుపుదల చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గండి నాయినబాబు, రొంగలి ముత్యాల నాయుడు, ఎర్ర దేవుడు, ఆటో యూనియన్ నాయకులు, వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

చీడికాడ : నక్కపల్లిలో బల్క్‌డ్రగ్ పార్క్ రద్దు చేయాలని, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సిపిఎం చీడికాడ మండల కమిటీ ఆధ్వర్యంలో మంచాల గదబురు జంక్షన్‌లో నిరసన చేపట్టారు. నిరసన కార్యక్రమంలో చీడికాడ సిపిఎం మండల కార్యదర్శి ఆర్ దేముడునాయుడు మాట్లాడుతూ ప్రజలు వ్యతిరేకిస్తున్న బల్క్ డ్రగ్ పార్క్‌ను ప్రధాని మోడీ శంకుస్థాపన చేయడం సబబు కాదన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.కన్నబాబు , బి నాగరాజు అప్పారావు గంగరాజు సన్నిబాబు సీతమ్మ గున్నమ్మ పాల్గొన్నారు.



అచ్యుతాపురంలో ....



గాజువాకలో సిపిఐ నిరసన



పరవాడలో ముఠా కార్మికుల ఆందోళన